ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 09.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ దృష్ట్యా రామగుండం ఎన్టీపీసీ రెండో దశలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవాలని కేందర్ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు .

2. నేటితో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగియనుంది. రాష్ట్రంలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణతో కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డిల ఎన్నిక దాదాపు ఏకగ్రీమవనుంది.

3. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 99 రోజుల కార్యాచరణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు

4. తెలంగాణను 'ఫ్యూచర్ రెడీ' పోలీసింగ్‌లో దేశానికే ఆదర్శంగా నిలపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

---------------------------------

**కిషన్ రెడ్డి**

రామగుండం ఎన్టీపీసీలో రెండో దశలో భాగంగా చేపట్టనున్న 2,400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి లేఖ రాశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం (PPA)

చేసుకోవాలని కోరారు. మొదటి దశలో నిర్మించిన 1,600 మెగావాట్ల ప్రాజెక్టు తరహాలోనే, రెండో దశలోనూ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 85 శాతం తెలంగాణకే లభిస్తుందని గుర్తుచేశారు. ఎన్టీపీసీకి ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల తక్కువ ధరకే నాణ్యమైన విద్యుత్ అందుతుందని, ఇది ప్రజలకు, ప్రభుత్వానికి ఎంతో లాభదాయకమని పేర్కొన్నారు. అలాగే, పూర్తి స్థాయి ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛనివ్వాలని విన్నవించారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యుత్ అవసరాల దృష్ట్యా ముఖ్యమంత్రి ఈ విషయంలో వ్యక్తిగత చొరవ చూపి, ప్రాజెక్టు విజయవంతానికి సహకరించాలని కిషన్ రెడ్డి తన లేఖలో ఆకాంక్షించారు.

**పీటీసీ - హైదరాబాద్**

----------------------------

**రాజ్యసభ ఎన్నికలు**

నేటితో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ఇవాళ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లను విత్ డ్రా చేసుకోవచ్చు. ఐతే తెలంగాణ రాజ్యసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైయ్యాయి. దీంతో రాష్ట్ర రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డిల ఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుంది. వీరి విజయం ఇక లాంఛనమైంది. ఇవాళ సాయంత్రం 4 గంటలకు రిటర్నింగ్ అధికారి వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించి... ధ్రువీకరణ పత్రాలను అందజేసే అవకాశం ఉంది. దీంతో పెద్దల సభలో అడుగుపెట్టేందుకు కాంగ్రెస్ అభ్యర్థులకు మార్గం సుగమమైనట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

**పీటీసీ - హైదరాబాద్**

----------------------------

**హెచ్ పీవీ వ్యాక్సిన్ పంపిణీ**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని నిన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ బి. నర్సింగరావు గద్వాల్ మున్సిపల్ చైర్ పర్సన్ టి. విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా

జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె సంధ్య కిరణ్మయి మాట్లాడుతూ ఈ ఎస్ పి వి వ్యాక్సిన్ 14 సంవత్సరాలు ఉన్న బాలికలకు వేస్తున్నామన్నారు. ఈ వ్యాక్సిన్ని ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ నివారణ కొరకు సింగల్ డోస్ 0.5 ఎంఎల్ వేస్తున్నామని ఈ వ్యాక్సిన్ ని ఈరోజు నుంచి 90 రోజులపాటు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో అల్లంపూర్ ఏరియా హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అల్లంపూర్ లో వేస్తున్నామని తెలియజేశారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, 14 సంవత్సరాల బాలికలకు మొబలైజు చేసి జిల్లాలో 7వేల 103 మంది ఉన్నారని వీరందరికీ హెచ్పీవీ వ్యాక్సిన్ వేయించాలని కోరారు.

**పీటీసీ - జోగులాంబ గద్వాల**

--------------------------

**హెచ్ పి వీ వ్యాక్సిన్ - సిరిసిల్ల**

గర్భాశయ క్యాన్సర్ నివారణకు 14 ఏళ్ల నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్ పి వీ తప్పనిసరిగా వేయించాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.....

**బైట్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**రాజరాజేశ్వర స్వామి ఆలయం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివకల్యాణోత్సవంలో భాగంగా నిన్న స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామి ఆలయం ముందు నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు రథోత్సవం సాగింది. ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, ఈవో రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య , డప్పు చప్పులతో రథోత్సవం నిర్వహించారు. పార్వతి రాజరాజేశ్వర స్వామివారాలను, అనంత పద్మనాభ స్వామి వారాల ఉత్సవ విగ్రహాలను రథ లపై ఊరేగించారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**పొన్నం ప్రభాకర్**

నవాబుపేట గ్రామం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో కలెక్టర్ చిత్రమిశ్రాతో కలిసి మంత్రి పొన్నం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామస్తులంతా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని, పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు వెల్లడించిన పొన్నం, నూతనంగా రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించి, పశు వైద్య ఉపకేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

**పీటీసీ - కరీంనగర్**

--------------------------------

**నల్గొండ - "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక**

నల్గొండలో "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించిన 5కే రన్‌ను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 99 రోజుల కార్యాచరణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవనశైలి సమస్యల నుంచి గట్టెక్కేందుకు ఫిట్‌నెస్ అవసరమని పేర్కొని, పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్జీ కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు సాగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

తెలంగాణను 'ఫ్యూచర్ రెడీ' పోలీసింగ్‌లో దేశానికే ఆదర్శంగా నిలపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నిన్న పోలీస్ అకాడమీలో జరిగిన 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026'లో శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టెక్నాలజీ, ట్రస్ట్, టాలెంట్ అనే 'ట్రిపుల్ టీ' వ్యూహంతో ఆధునిక సవాళ్లను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం నేరాలు డిజిటల్ రూపంలోకి మారి డీప్‌ఫేక్, వాయిస్ క్లోనింగ్ వంటివి పెను సవాల్‌గా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు 22 వేల 845 కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, ఇందులో అక్షరాస్యులే ఎక్కువగా బాధితులుగా మారుతున్నారని వివరించారు. రాబోయే రోజుల్లో ఏఐ, డేటా అనలిటిక్స్ సాయంతో నేరాలను ముందే అడ్డుకునే 'ప్రెడిక్టివ్ పోలీసింగ్'కు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డెస్క్**

---------------------------

**జల శక్తి కేంద్ర పథకం**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఆరేపల్లి గ్రామం జల శక్తి కేంద్ర పథకంలో రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. మిషన్ భగీరథ ద్వారా గ్రామంలో ప్రజలకు నూరుశాతం స్వచ్ఛమైన సురక్షిత తాగునీటిని అందిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించినట్టు గ్రామ సర్పంచ్ స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. హర్ ఘర్ జల్ కార్యక్రమం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అవార్డును స్వీకరించినట్లు వెల్లడించారు.

**పీటీసీ - హన్మకొండ**

-----------------------

**బం-రుక్న్-ఉద్-దౌలా చెరువు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని శివరాంపల్లిలో హైడ్రా పునరుద్ధరించిన బం-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణతో హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాలను పునరుద్ధరిస్తామని, చెరువుల వద్ద మహిళా స్వయం సహాయక సంఘాలతో స్టాల్స్ ఏర్పాటు చేసి 'లేక్ ఎకానమీ'ని ప్రోత్సహిస్తామని తెలిపారు. పాతబస్తీని 'ఒరిజినల్ సిటీ'గా అభివర్ణించిన సీఎం, అక్కడ మెట్రో రైలు విస్తరణ, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం, మూసీ పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తామన్నారు.

**డెస్క్**

--------------------------

**మహిళల హాకీ ప్రపంచ కప్**

హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్టాత్మక మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 4-0తో ఉరుగ్వేపై ఘనవిజయం సాధించింది. సునీలిత టొప్పో, ఇషికా, లాల్‌రెమ్సియామి, రుతుజా దాదాసో పిసల్ గోల్స్ చేసి జట్టును గెలిపించారు. తొలి క్వార్టర్ నుండి భారత క్రీడాకారిణులు దూకుడు ప్రదర్శించగా, ఉరుగ్వే జట్టు గోల్ చేసేందుకు ప్రయత్నించినా భారత రక్షణ శ్రేణి సమర్థంగా అడ్డుకుంది. ముఖ్యంగా లాల్‌రెమ్సియామి, రుతుజా మైదానం మధ్య నుండి బంతిని తీసుకెళ్లి చేసిన ఫీల్డ్ గోల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భారత జట్టు తన తదుపరి పోరులో భాగంగా ఇవాళ రాత్రి 7:30 గంటలకు స్కాట్లాండ్‌తో తలపడనుంది.

**డెస్క్**

--------------------------

**వాతావరణం**

తెలంగాణలో ఇవాళ నుంచి రేపు ఉదయం 8:30 గంటల వరకు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రాబోయే రెండు మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పులు ఉండవని వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాద హెచ్చరికలు జారీ చేయలేదు. ప్రజలు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**పీఎస్**

-----------------------